క్లుప్తంగా

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలో బుధవారం చేపట్టే నిర్వహణ, మరమ్మతు పనుల నేపథ్యంలో విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ టౌన్ ఈఈ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ కార్బైట్స్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న 220 కేవీఏ సబ్‌స్టేషన్ – 132 కేవీఏ సబ్‌స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌పై ట్రాన్స్‌కో హై పవర్ లైన్ టవర్ ఎత్తు పెంచేందుకు పనులు జరుగుతున్న కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో తమ డివిజన్ల పరిధిలోని జొహరాపురం, ఉస్మానియా, వార్త, శరీన్‌నగర్, జీ.పుల్లారెడ్డి, ఆర్‌సీఎన్, ఇండస్ట్రియల్, ఎస్టేట్, మిలటరీ కాలనీలోని 33కేవీఏ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న ఖడక్‌పురా మైదానం, ఉస్మానియా కళాశాల ఏరియా, మాసుంబాషా దర్గా, గాయత్రి ఎస్టేట్, బిర్లాగడ్డ, ఠాగూర్ నగర్, లక్ష్మీ నగర్, మద్దూర్ నగర్, బీ.క్యాంప్, సీ.క్యాంప్, గణేష్ నగర్, రెవెన్యూ కాలనీ, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, సాయి వైభవ్ నగర్, నంద్యాల చెక్‌పోస్టు ఏరియా, శేషాద్రీ నగర్, పోస్టల్ కాలనీ, మారుతి మెగా సిటీ, బృందావన్ నగర్, మారుతి నగర్, అరుంధతి నగర్, టెలికాం నగర్, గఫూర్ నగర్, పార్థసారథీ నగర్, కమలా నగర్, రామచంద్రనగర్, రామకృష్ణ నగర్, గుత్తి రోడ్డు, శరీన్ నగర్, అబ్బాస్ నగర్, కృష్ణానగర్, పాతబస్తీ, జొహరాపురం, ఇందిరమ్మ కాలనీ, మిలటరీ కాలనీ, గార్గేయపురం, దిగువపాడు, శివరాంపురం తదితర కాలనీలు, చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

22 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కర్నూలు కల్చరల్: స్థానిక సంకల్ బాగ్‌లోని హరిహర క్షేత్రంలో ఈ నెల 22వ తేదీ నుంచి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి 17వ వార్షికోత్సవం, శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కల్లె చంద్రశేఖర శర్మ తెలిపారు. 22న లక్ష్మీగణపతి హోమం, శేష వాహన సేవ, 23న రుద్ర, లక్ష్మీ కుబేర హోమం, అశ్వ వాహన సేవ, 24న మన్యుసూక్త హోమం, లక్ష్మీ కుబేర హోమం, సింహ వాహన సేవ, 25న నారాయణ, ధన్వంతర హోమం, హనుద్వాహన సేవ, 26న సరస్వతి హోమం (వసంత పంచమి), గరుడ వాహన సేవ, 27న సుదర్శన హోమం, గజవాహన సేవ, 28న అరుణ హోమం (రథ సప్తమి), 29న నవగ్రహ హోమం, హంస వాహన సేవ, 30న చంద్రప్రభ వాహన సేవ, 31న పంచ సూక్త హోమం, దివ్యమంగళ రథోత్సవం, ఫిబ్రవరి 1న ధ్వజారోహణం, చక్రస్నానం కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

26 నుంచి రథ సప్తమి వేడుకలు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు ఆలయ చతుర్థ వార్షికోత్సవం, రథ సప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. 26న గోపూజ, 27న లలితా సహస్రనామ హోమం, 28న అరుణ హోమం, 29న శ్రీ ఛాయా ఉషా సమేత శ్రీ సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం, 30న రాజ శ్యామల హోమం కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో పతకం సాధించాలి



రాష్ట్ర పోటీల్లో పాల్గొంటున్న జట్టుతో స్టేడియం చీఫ్ కోచ్ నటరాజరావు

కర్నూలు (టౌన్): ఈ నెల 18, 19 తేదీలలో నంద్యాల పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) పుట్‌బాల్ పోటీల్లో మంచి ప్రతిభ చాటి పతకాలు సాధించాలని స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ నటరాజరావు అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రాష్ట్ర పోటీల్లో పాల్గొంటున్న జట్టును పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్ర పోటీల్లో రాణించాలన్నారు. దీంతో జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఫుట్‌బాల్ సంఘం ప్రతినిధులు మహేష్, మల్లి, సుధాకర్, జలీల్, జగదీష్ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : వీర సింహారెడ్డి, వాల్తేర్ వీరయ్య, వారసుడు, తెగింపు, కల్యాణం కమనీయం
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్: వీర సింహారెడ్డి, వాల్తేర్ వీరయ్య, వారసుడు, తెగింపు, కల్యాణం కమనీయం,ధమాకా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వీర సింహారెడ్డి, వాల్తేర్ వీరయ్య , వారసుడు
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, వాల్తేరు వీరయ్య , ఎమ్.త్రీగన్, వీరసింహారెడ్డి
భరత్ కాంప్లెక్స్ : వీర సింహారెడ్డి, వాల్తేర్ వీరయ్య
రాజ్ : వీర సింహారెడ్డి
శ్రీరామ,విజయ : వాల్తేర్ వీరయ్య

చిట్టి తల్లి.. వెలుగుల దీప్తి

- ఆడపిల్లకు పిండ దశ నుంచే వివక్ష
- వేధింపులు, దాడులతో ఇక్కట్లు
- పథకాలతో అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- 24న జాతీయ బాలికా దినోత్సవం
- ఆడ పిల్ల ప్రాముఖ్యతను తెలిపేందుకు నేటి నుంచి వారోత్సవాలు



కర్నూలు(రాజ్‌విహార్): 'ఆడ'... అంటే రెండు అక్షరాలు కాదు.. ఒక కూతురు. ఒక చెల్లి. ఒక అక్క. ఒక భార్య, ఒక అమ్మ. ఒక అమ్మమ్మ. అందరు కలిపితేనే ఒక కుటుంబం. ఒకరు ధైర్యం చెప్పి అండగా నిలిస్తే ఎంతో మందికి ఆసరాగా మారుతుంది. ఇంటిల్లిపాదికి వెలుగుగా మారి వారి బాగోగులు చూస్తుంది. అలాంటి ఆడ పిల్ల ఆపదలో ఉంది. నిరక్షరాస్యత, ప్రభుత్వ పథకాలు, చట్టాల పట్ల అవగాహన లేకపోవడం, సమాజంలో జరుగుతున్న వివిధ పరిస్థితుల కారణంగా బాలికల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఆడ పిల్లల ప్రాధాన్యత తెలియజేయడం కోసమే ఈ నెల 24న జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం నుంచి వారం రోజుల పాటు వారోత్సవాలు నిర్వహించేందుకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

కాటేద్దామని పరాయి వాళ్లు :
ఆడపిల్లలకు కష్టాలు పిండ దశ నుంచే ప్రారంభమవుతున్నాయి. స్కానింగ్ పరీక్షలు నిర్వహించి భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. అనధికారిక లెక్కల ప్రకారం గత ఏడాది జిల్లాలో పాతికకు పైగా భ్రూణ హత్యలు జరిగినట్లు సమాచారం. అదేవిధంగా బాల్య వివాహాలతో వారి జీవితాన్ని నాశనం చేస్తున్నారు. ఆడ పిల్ల భారమని అయిన వాళ్లు భావిస్తుండగా మరో వైపు పరాయి వాళ్లు కాటు వేసేందుకు కాచుకొని ఉంటున్నారు. ఈవ్ టీజింగ్, వేధింపులు, అపహరణ, ఇతర ప్రాంతాలకు తరలించడం, అసాంఘిక కార్యకలాపాల్లోకి దించడం, దాడులు, హత్యలు ఇలా అనేక రకాల ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

బాలికల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట:
బాలికల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఓ దుర్ఘటనను దృష్టిలో పెట్టుకొని దిశ చట్టంతో పాటు ప్రత్యేక పోలీసు స్టేషన్ల ఏర్పాటు, గ్రామ సచివాలయాల్లో మహిళా పోలీసుల నియామకం చేపట్టింది. దీనికి తోడు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ భరోసా ఇస్తోంది. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులు, కాంట్రాక్టు పనుల్లో 50 శాతం వారికే కేటాయించేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చట్టం తెచ్చారు. అమ్మఒడితో పాటు అత్యధిక పథకాలను మహిళ పేరుతోనే మంజూరు చేస్తున్నారు. అంతేగాకుండా ప్రభుత్వం ఆదేశాలతో అధికారులు బాలికల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. 2020–21లో 82, 2021–22లో 26, 202–23లో 21 బాల్య వివాహాలను అడ్డుకున్నారు. 3,293 మంది బాల కార్మికులను గుర్తించారు. 105 మంది చిన్నారులను సెంట్రల్ అడాప్షన్ రీసోర్స్ అథారిటీ ద్వారా కేటాయించారు. 12 మంది అక్రమ రవాణాకు గురి కాబడిన బాలలను రక్షించి ప్రజ్వల హోంలో చేర్పించారు. పిల్లలు వద్దనుకునే వారి కోసం ఉయ్యాల కార్యక్రమం ద్వారా తీసుకొని పిల్లలు లేని వాళ్లకు దత్తత ఇచ్చే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా 1,886 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1.85 లక్షల పిల్లలు సేవలు పొందుతుండగా అందులో 95,486 మంది ఆడ పిల్లలు ఉన్నారు. వీళ్లకు కిశోరి వికాసం పేరుతో అదనపు పౌష్టికాహారం అందిస్తున్నారు.

నేటి నుంచి వారోత్సవాలు
జాతీయ బాలికా దినోత్సవంలో భాగంగా 18వ తేదీ బుధవారం అంగన్‌వాడీల్లో బాలింతలు, తల్లులకు అవగాహన కల్పిస్తారు. 19న గ్రామ సభలో బాలిక నిష్పత్తి గురించి, నైపుణ్యాభివృద్ధి, గృహ సందర్శన, కొత్తగా పెళ్లైన జంటలకు ఆడ పిల్లల యొక్క ప్రాముఖ్యతను వివరిస్తారు. 20న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలిక సంరక్షణ పోస్టర్లను అతికించి వివిధ పోటీలు నిర్వహిస్తారు. 23న గ్రామ స్థాయిలో ఆడ పిల్లలను రక్షించడం, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పోషకాహారం, గర్భస్థ లింగ నిర్ధారణ తదితర వాటిపై అవగాహన, 24 అంగన్‌వాడీ, సచివాలయాల పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

బరువు కాదు.. బాధ్యత
ఆడ పిల్లలంటే బరువుగా భావించరాదు. ఆమెను అన్ని విధాలా సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. జిల్లాలో బాలికల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాం. బాలికల అపహరణ, బాల్య వివాహాలు, దాడులు, వేధింపులు, హింస వంటి వాటిని అడ్డుకునేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నాం. ఆడ పిల్లల కోసం ఎన్నో పథకాలను ప్రభుత్వం తెచ్చింది. వాటిని సద్వినియోగం చేసుకోవాలి.
–కేఎల్ఆర్‌కే కుమారి, పీడీ, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ కర్నూలు

మానవత్వాన్ని చాటిన ఎమ్మెల్సీ

- తాను లేచి ఇతరులకు సీటు ఇవ్వడంపై హర్షం



తాను లేచి ఇతరులకు సీటు ఇచ్చిన శాసనమండలి సభ్యుడు ఇక్బాల్

కర్నూలు(అగ్రికల్చర్): శాసనమండలి సభ్యుడు, రాయలసీమ విశ్రాంత ఐజీ ఇక్బాల్ కర్నూలు సీ.క్యాంపు సెంటరులోని డివిజినల్ సబ్ ట్రెజరీ కార్యాలయానికి మంగళవారం వచ్చారు. ఆయనను అధికారులు సాదరంగా ఆహ్వానించారు. సబ్ ట్రెజరీ అధికారులతో పెన్షన్ పేపర్ల విషయమై మాట్లాడుతుండగా... ఇద్దరు విశ్రాంత ఉద్యోగులు వచ్చారు. వారు నిలబడలేని పరిస్థితిని గమనించిన ఎమ్మెల్సీ ఇగ్బాల్ తాను లేచి నిలబడి వారికి సీటు ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆయన మంచితనంపై ట్రెజరీ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ట్రెజరీ అధికారులు ఆయనకు పెన్షన్ పేపర్లు అందజేశారు.

సమస్యలు ఉంటే చెప్పండి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ ఇచ్చి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ప్రజాప్రతినిధులందరం మీ వద్దకే వస్తున్నాం..
- 'గడప గడప'లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- చిన్నటేకూరులో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పలకరింపు

కల్లూరు: రాష్ట్రంలో ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిన్నటేకూరు గ్రామంలో సర్పంచ్ లక్ష్మన్న, ఎంపీటీసీ సోమన్న, గ్రామ నాయకులు పెద్ద ఈశ్వరయ్య, నారాయణ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. మూడేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్లను అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించేందుకే ప్రజాప్రతినిధులందరం మీ ఇళ్ల దగ్గరకు వస్తున్నామన్నారు. గ్రామంలోని కృష్ణనగర్‌లో డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు నిర్మించాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, ఇళ్లు మంజూరు చేయాలని ప్రజలు కోరగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అర్హులైన వారందరికి మేలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో 98 శాతం అమలు చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏదైన పథకం రావాలంటే జన్మభూమి కమిటీ సిఫార్సులతో పాటు ఆ పార్టీ నాయకుల అండదండలు ఉండాలన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారిపోయిందన్నారు. జగనన్న వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి రాజకీయాలకు అతీతంగా ఎలాంటి సిఫార్సులు లేకుండా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే డబ్బును జమ చేస్తూ అవినీతి రహిత పాలన అందిస్తున్నారని చెప్పారు. జనరంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కల్లా వెంకట రమణారెడ్డి, సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి, చెట్లమల్లాపురం సర్పంచ్ ఎస్.భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ అశోక్ వర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు దండు లక్ష్మికాంతరెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, మండల నాయకులు హనుమంతురెడ్డి, మస్తాన్ నాయుడు, చాంద్‌బాషా, రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, ఎంపీడీవో జీవీ రమణమూర్తి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదుకున్న 'జగనన్న చేయూత'తో




గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌తో మహిళ విజయలక్ష్మి
- లాల్ మసీదు ఏరియాలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు(రాజ్‌విహార్): 'నా భర్త రోజువారీ తాపీ పనులకు వెళ్తే.. నేను కూరగాయల కొట్టు పెట్టుకున్నా. దీని నుంచి రోజుకు వచ్చే రూ. ఐదారు వందలతో ఇల్లు గడుస్తోంది. జగనన్న 45 ఏళ్లు దాటిన మహిళలకు జగనన్న చేయూత పథకం ద్వారా రూ.18,750 ఇస్తున్నారని వలంటీర్ వచ్చి చెప్పి పేరు రాసుకెళ్లింది. ఎవరి చుట్టూ తిరక్కపోయినా బ్యాంక్ ఖాతాలో దుడ్లు వేసినాడు. ఆ దుడ్లు నా వ్యాపారానికి ఎంతో ఉపయోగపడిందని' లాల్ మసీదు ప్రాంతానికి చెందిన విజయలక్ష్మి ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్‌ఖాన్‌తో చెప్పుకుంది. మంగళవారం ఎమ్మెల్యే 10వ వార్డులో వివిధ శాఖల అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. లాల్ మసీదు, చేపల సందు, మాసుంబాషా దర్గా స్ట్రీట్ ఏరియాల్లోని వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరిస్తూ ప్రభుత్వం మూడేళ్లలో మంజూరు చేసిన సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందించారు. వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకొని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ 45 ఏళ్ల వయస్సు దాటిన మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయూత పథకం ద్వారా రూ.18,750 అందిస్తున్నారని చెప్పారు. కేవలం అర్హత ప్రామాణికంగా పథకాలను అమలు చేస్తున్నారని, ప్రతి ఏటా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యూనుస్ బాషా, నాయకులు డాక్టర్ రేహాన్ అలీఖాన్, పర్వేజ్, నజీర్, నూరుల్లాఖాద్రీ, సోహెల్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ముడుపులివ్వకుంటే వేధింపులే!

- కొత్తపేట రైతుబజారు ఎస్టేటు అధికారి ఇష్టారాజ్యం
- పైసలు ఇవ్వకపోతే కూరగాయల ధరల తగ్గింపు



కొత్తపేట రైతుబజారు బోర్డుపై ఆలు ధర కిలో రూ.24 రాసిన దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో మూడు రైతుబజార్లు ఉన్నాయి. అయితే కొత్తపేటలోని రైతుబజారు తీరు ప్రత్యేకం. ఎస్టేటు అధికారి రైతుబజారులో కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, నిమ్మకాయలు అమ్ముకునే వారిని పీల్చి పిప్పి చేస్తున్నారు. ప్రతి రోజు హోల్‌సేల్ ధరలను అనుసరించి కర్నూలు సీ.క్యాంపు రైతుబజారులో కూరగాయల ధరలను నిర్ణయిస్తారు. సి.క్యాంపులో నిర్ణయించిన ధరలకే కొత్తపేట రైతుబజారులో కూడా విక్రయించాలి. అయితే అనధికారికంగా కొత్తపేట రైతు బజారులో ఎక్కువ రేట్లకు అమ్ముకోవాలన్నా, సీ.క్యాంపు రైతుబజారులో నిర్ణయించిన ధరలను బోర్డుపై రాయాలన్నా ఎస్టేటు అధికారికి పైసలు ఇచ్చుకోవాల్సిందే. ముడుపులు ఇవ్వకపోతే ధరలను పూర్తిగా తగ్గించి రాస్తుండటం గమనార్హం.

ఆలు ధర రూ.24కు తగ్గింపు :
మంగళవారం సి.క్యాంపు రైతుబజారులో ఆలుగడ్డల ధర కిలో రూ.34గా నిర్ణయించారు. కొత్తపేట రైతుబజారులో కూడా రూ.34 ఉండాలి. కానీ రూ.24 మాత్రమే రాయడం పట్ల రైతుబజారులో కూరగాయలు అమ్ముకునే వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ముడుపులు ఇవ్వనందుకే ఆలు ధర తగ్గించారని ఆరోపణలు ఉన్నాయి. ఆకు కూరలు, నిమ్మకాయలు, అల్లం తదితర వాటిని అమ్ముకునే వారందరూ వారానికి, 15 రోజులకు స్థాయిని బట్టి రూ.500 నుంచి రూ.1500 వరకు ముడుపులు చెల్లించాల్సిందే. లేకపోతే వారికి చుక్కలు చూపిస్తారనే విమర్శలు ఉన్నాయి.

ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యం :
రైతుబజారు అధికారి సాగిస్తున్న అక్రమ వసూళ్లపై పలుసార్లు మార్కెటింగ్ శాఖ ఏడీ, జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం ఈ రైతుబజారు ఎలా ఉంది అనే దానిని కూడా పరిశీలించిన దాఖలాలు లేవు. కాగా ఎస్టేటు అధికారి వసూళ్ల పర్వాన్ని ఏడీఎం నారాయణ మూర్తి దృష్టికి తీసుకెళ్లగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏడీఎంగా ఇక్కడికి కొన్ని నెలల క్రితమే వచ్చానని, ఇంతవరకు తన దృష్టికి ఫిర్యాదులు రాలేదన్నారు.

పారిశుద్ధ్య కార్యాలయానికి తాళం



తాళం వేసిన కార్యాలయం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న పోలీసులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఏ–1 శానిటేషన్ ఏజెన్సీ కార్యాలయానికి యూనియన్ నాయకులుగా చెప్పుకునే కొందరు మంగళవారం ఉదయం తాళం వేశారు. దీంతో ఆ సమయంలో విధుల్లోకి వచ్చిన పారిశుద్ధ్య కార్మికులను బయోమెట్రిక్ వేయనీయకుండా అడ్డుకున్నారు. ఇటీవల రేడియాలజీ విభాగంలో ఓ పారిశుద్ధ్య కార్మికురాలు అక్కడి వైద్యురాలితో గొడవ పడింది. దీంతో పారిశుద్ధ్య కార్మికురాలు రేడియాలజీ విభాగంలో దుర్భాషలాడిందని ఆసుపత్రి అధికారులకు వైద్యురాలు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రి అధికారుల ఆదేశాలతో శానిటరీ ఏజెన్సీ ప్రతినిధులు పారిశుద్ధ్య కార్మికురాలిని విధుల నుంచి తొలగించారు. ఆమెను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఉదయం కొందరు యూనియన్ నాయకుల పేరుతో కార్యాలయం వద్దకు వచ్చి గొడవకు దిగారు. ఈ సమయంలోనే కార్యాలయానికి తాళం వేసి ఎవ్వరూ లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ విషయాన్ని శానిటేషన్ సూపర్‌వైజర్లు మూడవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడికి వచ్చి గొడవను సద్దుమణిగేలా చేసి కార్యాలయానికి వేసిన తాళం తీయించారు. కార్యాలయానికి తాళం వేయడం నేరమని, ఏదైనా ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

శివారు కాలనీలకు మహర్దశ

- 39వ డివిజన్‌లో చురుగ్గా అభివృద్ధి పనులు
- రూ.4.13 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన



డివిజన్‌లోని కాలనీలో కొత్తగా నిర్మించిన మురుగు కాల్వ



కేసీ కెనాల్ చుట్టు ఇనుప కంచె ఏర్పాటు చేసిన దృశ్యం

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక శివారు కాలనీలకు మహర్దశ వచ్చింది. కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 39వ వార్డులో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ వార్డులోని కాలనీలన్ని గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేవి. దీని వల్ల స్థానికంగా అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. 2014 సంవత్సరంలో స్టాంటన్‌పురం గ్రామ పంచాయతీని మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించకపోవడం, అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో స్థానిక ప్రజలు సమస్యలతో సతమతమయ్యారు. దాదాపు ఏడు, ఎనిమిది సంవత్సరాలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే 2019 సంవత్సరంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం, వచ్చిన ఏడాదిలోపు మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించడం జరిగింది. కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పాలకవర్గం అధికారం చేపట్టడంతో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ఏడాదిన్నరలో ఒక్క 39వ వార్డులోనే రూ.4.13 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టారు.

39 డివిజన్ పరిధిలోని కాలనీలు :
స్టాంటన్‌పురం, కె.సి. కెనాల్ కొట్టాలు, అంబేడ్కర్‌నగర్, డి.మోజస్ కాలనీ, కొండారెడ్డి నగర్, శ్రీనివాస నగర్, బాలాజీనగర్ (కొంత) మమతానగర్ కొట్టాలు, స్టాంటన్‌పురం కుంట, షాజహాన్ నగర్, దావూద్‌ఖాన్ కాలనీలు ఉన్నాయి. స్టాంటన్‌పురం ఏబీఎం చర్చి వద్ద రూ.10 లక్షలతో, షాజహాన్ నగర్, కొండారెడ్డినగర్‌లలో రూ.20 లక్షలతో మురుగు కాల్వల నిర్మాణం చేపట్టారు. స్టాంటన్‌పురంలో రూ.80 లక్షలు వెచ్చించి అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వార్డు పరిధిలోని గని గుంతలు ప్రమాదాలకు అడ్డాగా ఉండేవి. ఇదే కాలనీలో కేసీ కెనాల్ వెళ్తుంది. గని గుంతల్లో పడి చిన్న పిల్లలు ప్రమాదాలకు గురికావడం, మృతి చెందడం వంటి సంఘటనలు జరిగాయి. దీంతో అప్పట్లోనే కంచె ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉండేది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమైన ప్రాంతాల్లో రూ.10 లక్షలు వెచ్చించి కేసీ కెనాల్ చుట్టు కంచె ఏర్పాటు చేశారు. కాలనీల్లో రూ.10 లక్షలతో దెబ్బతిన్న బీటీ రోడ్లకు ప్యాచ్ వర్కులు పూర్తి చేశారు. రూ.49 లక్షలతో మురుగు కాల్వలు, కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టారు. ఇంకా కాలనీల్లో ప్రాధాన్యత క్రమంలో పలు అభివృద్ధి పనులు చేశారు.

సమస్యలు తీరుతున్నాయి



మా వార్డులో నెలకొన్న సమస్యలతో ప్రజలు చాలా ఏళ్లుగా ఇబ్బందులు పడ్డారు. అయితే ఇప్పుడిప్పుడే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. స్టాంటన్‌పురం పంచాయతీలో ఉండేది. పదేళ్ల క్రితం కార్పొరేషన్‌లో విలీనం చేశారు. ఇప్పుడు కార్పొరేటర్ ఉండటంతో ఆయన సమస్య చెబితే స్పందించి పరిష్కరిస్తున్నారు. మురుగు కాల్వల పనులు జరుగుతున్నాయి.
– జి. సూర్యబాబు, కొండారెడ్డినగర్

డివిజన్‌ను మరింత అభివృద్ధి చేస్తా :



39వ డివిజన్ మొత్తం గ్రామపంచాయతీ కింద ఉన్న కాలనీలు. పదేళ్లుగా ఈ కాలనీల్లో అభివృద్ధి పనులు జరుగలేదు. సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు లేవు. ప్రమాదకరంగా గని గుంతలు, కేసీ కెనాల్ ఉండేది. నేను కార్పొరేటర్‌గా ఎన్నికైన ఏడాదిన్నరలోపే ప్రజలు కోరిన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టా. వార్డులో మురుగు కాల్వలు పెద్ద ఎత్తున నిర్మించాం. ఇప్పటికే రూ.4 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టా. డివిజన్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా.
– సాంబశివరావు, 39వ వార్డు కార్పొరేటర్

క్యాలెండర్ ఆవిష్కరణ



ఏపీవీడబ్ల్యూఎస్ఈఏ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు కల్చరల్: ఆంధ్ర ప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం (ఏపీవీడబ్ల్యూఎస్ఈఏ) 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఏపీవీడబ్ల్యూఎస్ఈఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదుగుల రాజశేఖర్, జిల్లా అధ్యక్షులు శేఖర్, ప్రధాన కార్యదర్శి వీరేష్, ఉపాధ్యక్షులు శశికళ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్షావలి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మోహనాచారి, జాయింట్ సెక్రటరీలు వెంకటేశ్వర్లు, సుధీర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని 8వ వార్డులో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పరమేష్ పాల్గొన్నారు. విజేతలైన శిరీషా (మొదటి బహుమతి), సువర్ణ (రెండవ బహుమతి)తో పాటు మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన వారితోపాటు పార్టిసిపేషన్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాగార్జున, మంజు, పెద్దయ్య, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.